
సాక్షి
బాపట్ల
బుధవారం । 6 । నవంబర్ । 2024




### కార్తిక పూజలు

యడ్లపాడు: మండలంలోని సొలసలో భూసమేత రంగనాయస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక పూజలు వైభవంగా నిర్వహించారు.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 586.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,443 క్యూసెక్కులు వదిలారు.



### సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7226 , హై లెవల్ కాలువకు 306 క్యూసెక్కులు విడుదల చేశారు.

## న్యూస్‌రీల్

### డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్‌అదాలత్

**సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు**

రేపల్లెరూరల్: మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూరేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌కోర్టు ప్రాంగణంలో డిసెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో మంగళవారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ ప్రతినెల లోక్‌అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



తాళ్ళాయపాలెం (తాడికొండ): ఈ నెల 7వ తేదీన తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ... తాళ్ళాయపాలెంలో 7వ తేదీన సీఎం చేతుల మీదుగా 400/200 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేయనున్నారని చెప్పారు. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం ప్రారంభించనున్న సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### పురస్కారానికి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక



నగరంపాలెం: అజో విభో కందాళం ఫౌండేషన్ ప్రతి సంవత్సరం రచయితకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. వచ్చే ఏడాది 2025కిగాను అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను పురస్కారానికి ఎంపిక చేసినట్లు అరసం ఏపీ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5వ తేదీల్లో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరగబోయే సభలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### అర్హులందరికీ సిలిండర్లు



తెనాలి రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ, బాలాజీరావుపేట ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన దీపం -2 పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సిలిండర్లను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు. బాలాజీరావుపేట అయ్యప్ప స్వామి గుడి సమీపంలో పంపిణీ సందర్భంగా ఆయన గ్యాస్ పొయ్యిని వెలిగించగా.. లబ్ధిదారు మల్లవరపు శివమ్మ టీ కాచి మంత్రి, జిల్లా కలెక్టర్ సహా అధికారులకు అందజేశారు. అందరూ కేవైసీ చేసుకోవాలని మంత్రి సూచించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్‌వో కోమలి పద్మ, సీఎస్‌డీటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ‘పచ్చ’ పంచాయితీ వాయిదా!

- అందుబాటులో లేని బాపట్ల ఎంపీ, ఎమ్మెల్యేలు
- విదేశాల్లో ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు
- ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మల మధ్య విభేదాలు
- డీఆర్సీకి ఎగనామం పెట్టిన ఎంపీ కృష్ణప్రసాద్



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లా పచ్చపార్టీలో ఇంటిపోరు పంచాయితీ వాయిదా పడింది. జిల్లాలోని పలువురు పచ్చపార్టీ ప్రజాప్రతినిధుల మధ్య విబేధాలు పతాక స్థాయికి చేరి రోడ్డెక్కడంతో పంచాయితీ పెట్టి మందలించాలని ముఖ్యమంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథిని ఆదేశించారు. దీంతో మంగళవారం డీఆర్‌సీ సమావేశానికి బాపట్ల వచ్చిన ఇన్‌చార్జి మంత్రి మధ్యాహ్నం తర్వాత జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పార్టీలో రచ్చపై పంచాయితీ పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే ప్రధానంగా గొడవ పడుతున్న బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఎంపీ కృష్ణప్రసాద్‌లు డీఆర్‌సీకి హాజరు కాలేదు. బాపట్ల ఎమ్మెల్యే వర్మ విదేశాలకు వెళ్లగా ఎంపీ కృష్ణప్రసాద్ డీఆర్సీ సమీవేశానికి డుమ్మా కొట్టారు. ఇక అక్రమాలు, అవినీతి ఆరోపణలతోపాటు సొంతపార్టీ నేతల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సైతం విదేశాల్లో ఉండడంతో డీఆర్‌సీకి రాలేదు. ఇదే పరిస్థితుల్లో కొట్టు మిట్టాడుతున్న చీరాల ఎమ్మెల్యే డీఆర్‌సీకి హాజరైనా బాపట్ల, పర్చూరు ఎమ్మెల్యేలతోపాటు ఎంపీ అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి మంత్రి పచ్చనేతల పంచాయితీని వాయిదా వేశారు. జిల్లా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లతో మాట్లాడిన ఇన్‌చార్జి మంత్రి వారి సూచనల మేరకు అందరూ ఉన్నప్పుడు పంచాయితీ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో సాయంత్రం జిల్లా టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మంత్రి వెళ్లి పోయారు.

**టీడీపీ నేతలపై జనసేన, బీజేపీ నేతల ఫిర్యాదు..**

జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడంలేదని, కలుపుకొని పోవడంలేదని జిల్లాకు చెందిన జనసేన, బీజేపీ నేతలు కొందరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసుల పార్థసారధి, మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు ఫిర్యాదు చేశారు. మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రులను కలిసి వారు టీడీపీ నేతల పై ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఎన్నికల్లో తాము టీడీపీ అభ్యర్థుల గెలుపుకు కృషిచేశామని, గెలిచిన తర్వాత నాయకులు తమను పట్టించుకోవడంలేదని వారు చెప్పినట్లు తెలుస్తోంది. అధికారుల బదిలీల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఏకపక్షంగా వ్యవహరించారని, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు రెండు పార్టీల నేతలు ఫిర్యాదు చేశారు. బదిలీల్లో తమకు ఏమాత్రం ప్రాధాన్యత నివ్వలేదన్నారు. ముఖ్యంగా బాపట్లతోపాటు జిల్లాలోని కొందరు శాసనసభ్యులు తమను ఏమాత్రం గౌరవించడంలేదన్నారు. ఎమ్మెల్యేలు చేస్తున్న పలు అక్రమాల వివరాలను సైతం మంత్రులకు వివరించినట్లు సమాచారం. అందరినీ సమన్వపరిచి పరిస్థితులు చక్కదిద్దుతామని మంత్రులు జనసేన, బీజేపీ నేతలకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

### రెడ్ బుక్ అమలులో ఉంది

రెడ్‌బుక్.. రెడ్‌బుక్ అంటూ ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని రెడ్ బుక్ అమలులో ఉందని చెప్పడానికి తమకేం భయం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించేవారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రపంచస్థాయిలో ఆర్థిక సంస్థలు రాష్ట్రానికి పరుగెత్తుకుంటూ వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీల సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ మూడుపార్టీల సమన్వంతో ఆంధ్రరాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రతిరోజు పేదల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

### డీఆర్సీకి ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల డుమ్మా..

జిల్లాలో జరిగిన తొలి డీఆర్సీకి పలువురు ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు విదేశాల్లో ఉన్నట్లు తెలుస్తుండగా బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ డీఆర్సీకి హాజరు కాలేదు. అభివృద్ధి మండలి సమావేశానికి అధికార పార్టీకి చెందిన ఎంపీతో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వారం క్రితమే తేదీలు ఖరారైనా.. ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండకపోవడంపై చర్చసాగుతోంది.

# సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం
- ఉచిత ఇసుక సక్రమంగా అమలు కావడం లేదు
- జిల్లాలో కాల్వల ఆధునికీకరణ చేపట్టాలి
- సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

బాపట్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే బాపట్ల జిల్లా అభివృద్ధి పట్టాలపై పరుగులెడుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో జిల్లా అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం డీఆర్‌సీ సమావేశంలో చర్చించిన అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి పార్థసారథి చెప్పారు. బాపట్ల జిల్లాకు 95 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, పర్యాటకంగా వివిధ ప్రాజెక్టులతో అభివృద్ధి చేయగలిగితే అన్ని రంగాలలో రాణించగలమన్నారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి నివేదిస్తే సత్వరమే అమలులోకి తెస్తామన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కింద గతంలో నిర్మించుకున్న గృహాలకు నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో 50,415 గృహాలు మంజూరు కాగా, 16, 362 గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు.

**కాల్వల ఆధునికీకరణ వేగవంతం చేయాలి**

**–గొట్టిపాటి రవికుమార్, జిల్లా మంత్రి**

పంటకాల్వల ఆధునికీకరణ పనులు జిల్లాలో వేగంగా చేపట్టాలి. పంట కాలువలలో నీటి ప్రవాహంపై అధికారులు పర్యవేక్షణ ఉండాలి. నీటి విడుదల సమయంలోనే కాలువల మరమ్మతులు ఎలా చేస్తారు? ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారుతున్నాయి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. భావనాసి రిజర్వాయర్‌కు నీరందించే ప్రక్రియ వేగంగా చేపట్టాలి. బాపట్ల జిల్లాకు 200 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయి. రూ.88 కోట్లు ఖర్చు అవుతాయి. రెండు నెలల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తి చేయాలి.

**అభివృద్ధికి సహకరించాలి**

**– అనగాని సత్యప్రసాద్, జిల్లా మంత్రి**

ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు ఉంటే విచారించి తొలగించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందించాలి. జల వనరుల శాఖ అధికారులు క్షేత్ర పరిశీలన లేకపోవడంతోనే చివరి భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. అయినా జల వనరులు, డ్రైనేజీ శాఖ అధికారులకు ఇవేమి పట్టడం లేదు.

### ‘స్వర్ణాంధ్ర-2047’ కోసం కృషి

**–జి.వెంకట మురళి, జిల్లా కలెక్టర్**

స్వర్ణాంధ్ర–2047 విజన్ బాపట్ల లక్ష్యంతో యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందది. వ్యవసాయ రంగం ద్వారా రానున్న ఐదేళ్లలో రూ.38 వేల 165 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. పారిశ్రామిక రంగంలో రూ.13,862 కోట్లు, సేవా రంగంలో రూ.23,033 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యం. దీపం–2 పథకం కింద జిల్లాలోని 3.53 లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి రూ.87.48 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇటీవల కృష్ణానది విపత్తుతో దెబ్బతిన్న గృహాలు, పంటలకు రూ.69 కోట్ల పరిహారం ప్రభుత్వం చెల్లించింది.

- గుంటూరు ఛానల్ విస్తరణపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడగా, నిషేధిత భూముల నుంచి పట్టా భూములను తొలగించాలని మరో ఎమ్మెల్సీ మాధవరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉచిత ఇసుక సక్రమంగా అమలు చేయడం లేదని, చీరాల, పర్చూరు నియోజక వర్గాల్లో ఇష్టానుసారంగా అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారని, ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టాలని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరగా, కాల్వలపై లస్కర్లను నియమించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

### భక్తిశ్రద్ధలతో నాగులచవితి



నాగుల చవితి సందర్భంగా మంగళవారం రేపల్లె మండలం పేటేరులోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు సమర్పిస్తున్న భక్తులు - రేపల్లె రూరల్

# వెంటాడిన మృత్యువు

**విధి ఆ కుటుంబంపై చిన్నచూపు చూసింది.. మృత్యువు వారిని వెంటాడి లోబరుచుకుంది. మామ గుండెపోటుతో చనిపోగా, ఆయన అంత్యక్రియలకని దూరప్రాంతం నుంచి వచ్చిన అల్లుడిని లారీ బలితీసుకుంది. దీంతో తల్లి, కూతుళ్లు ఒక్కరోజు తేడాలో తమ భర్తలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఘటనలతో కారంచేడులో విషాద ఛాయలు అలుముకున్నాయి.**

- ఆదివారం మామ.. మంగళవారం అల్లుడు మృతి
- కారంచేడులో విషాదం



సదాశివరావు (ఫైల్)

కారంచేడు/చినగంజాం: మృత్యువు ఆ కుటుంబాన్ని వెంటాడింది. గుండెపోటుతో మామ మృతిచెందిన ఒక్క రోజు వ్యవధిలోనే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన బాపట్ల జిల్లా కారంచేడులో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కారంచేడుకు చెందిన సీనియర్ నాయకుడు యార్లగడ్డ అక్కయ్య చౌదరి (66) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుమార్తె శేషుకుమారి భర్త ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన మార్నెళ్ల సదాశివరావు (49) మంగళవారం తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై కారంచేడు వెళుతుండగా చినగంజాం టోల్‌ప్లాజా దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయాడు. రోడ్డుపై పడిపోయిన సదాశివరావు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని మేనమామ జిల్లెలమూడి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. టోల్ ప్లాజ్ వద్ద వేగంగా వెళుతున్న లారీ నంబరు, లారీ వివరాలు సీసీ కెమెరాలో నమోదు కావడంతో ఎస్ఐ శీలం రమేష్ వెంటనే స్పందించి హైవే పోలీసులకు సమాచారం అందించి ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



సంఘటనా స్థలంలో రోడ్డుపై పడి మృతి చెందిన సదాశివరావు

**మామ అంత్యక్రియలకని వచ్చి..**

తల్లీకూతుర్లు ఒక్క రోజు తేడాతో భర్తలను కోల్పోయారు. ఈ విషాద సంఘటనతో కారంచేడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదాశివరావు కుటుంబం అక్కయ్యచౌదరి మరణ వార్తను విని ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కారంచేడు వచ్చారు. సోమవారం అంత్యక్రియలు ముగిశాయి. మంగళవారం సదాశివరావు నాగులుప్పలపాడు వెళ్లి తిరిగి కారంచేడుకు వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదానికి బలయ్యాడు. మృతునికి భార్య, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు.

# పరాకాష్టకు ‘అధికార’ దౌర్జన్యాలు

**హైవే వెంట నిర్వహిస్తున్న రెస్టారెంట్‌కు దారి లేకుండా తవ్వేసిన వైనం**



రెస్టారెంట్ ముందు పొక్లెయిన్‌తో గుంతలు తీస్తున్న వైనం

పర్చూరు (చినగంజాం): అధికార పార్టీ దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పూర్తి కాకుండానే వారి అధికార దర్పాన్ని చూపిస్తున్నారు. పర్చూరు మండలం పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన కొడవలి అప్పయ్యచౌదరి అపర్ణ రెస్టారెంట్ పేరుతో పర్చూరు హైవే పక్కన హోటల్ నడుపుకొంటున్నాడు. తాను హోటల్ నడుపుకొనేందుకు స్థలాన్ని లీజుకు తీసుకొని పక్కా నిర్మాణం చేసుకొని గత కొంత కాలంగా నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో పర్చూరు గ్రామ పంచాయతీ హోటల్ ముందు భాగంలో ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకొని, డ్రైనేజీ నీరు పోనివ్వకుండా మూసేశాడంటూ ఈ నెల 4 వతేదీ అప్పయ్య చౌదరికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన వెంటనే 5వ తేదీ మంగళవారం పంచాయతీ కార్యదర్శి తన వెంట పోలీసు సిబ్బందిని తీసుకొని రెండు పొక్లెయిన్‌లు సైతం తెచ్చి హడావుడిగా హోటల్‌కు అడ్డంగా ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సమాంతరంగా మట్టిని తొలగించారు. ఫలితంగా హోటల్‌కు వెళ్లే మార్గాన్ని పూర్తిగా తొలగించారు.

**రాజకీయ కక్షతోనే..**

తాను ఎటువంటి ఆటంకం లేకుండా హోటల్ నిర్వహించుకుంటున్నానని.. అధికార పార్టీ నాయకులు తనపై కక్ష కట్టి హోటల్ మార్గాన్ని తొలగించి ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని హోటల్ నిర్వాహకుడు అప్పయ్య చౌదరి ఆరోపిస్తున్నాడు. నోటీసులు ఇచ్చి సమాధానం ఇచ్చే అవకాశం లేకుండా వెంటనే మార్గంలోని మట్టిని తొలగించి భారీగా గొయ్యి చేశారన్నారు. తాను పెద్దివారిపాలెం సర్పంచ్‌గా ఉన్నానని, వైఎస్సార్ సీపీకి కార్యకర్తగా ఉన్న తనపై అప్పటి అధికార టీడీపీ తనపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని, మళ్లీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి తనపై కక్ష సాధించే కార్యక్రమంలో భాగంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని చెప్పాడు. ప్రతి రోజు హోటల్ దగ్గరకు పోలీసులు వచ్చి మానసికంగా భయాందోళనకు గురిచేస్తూ మంగళవారం ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని తెలిపాడు. అధికార పార్టీ వేధింపులు భరించలేని పరిస్థితిలో ఇటీవల సర్పంచ్ పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరానని అన్నాడు. అయినప్పటికీ అధికార పార్టీ వారు నాపై దౌర్జన్యం ఆపక మంగళవారం ఈ దారుణానికి పాల్పడ్డారని తెలిపారు. భవిష్యత్‌లో మరికొన్ని చర్యలు నాపై చేపట్టి ఇబ్బందులు గురి చేసే అవకాశం ఉంటుందని ఆయన ఆవేదనతో మాట్లాడారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి మస్తాన్‌వలిని వివరణ కోరగా రెస్టారెంట్ పక్కన ఉన్న అంబేడ్కర్ సామాజిక భవనం నిర్వాహకులు, హ్యూమన్ రైట్స్ వారు పంచాయతీలో వర్షపు నీరు పోయే మార్గం లేక ఇబ్బందిగా ఉందని పంచాయతీలో ఫిర్యాదు చేసిన మీదట 4వ తేదీ సదరు హోటల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి మంగళవారం డ్రైనేజీకి అనుకూలంగా మట్టి తొలగించామని చెప్పారు. బుధవారం హోటల్‌కు మార్గం కల్పిస్తామని తెలిపారు.



రెస్టారెంట్ ముందు భారీగా తవ్విన గుంత

# అల్లాడుతున్న ‘ఆలపాటి’

- తెలుగు తమ్ముళ్ల సహాయ నిరాకరణ
- దాటవేత ధోరణిలో సీనియర్లు
- పట్టించుకోని జనసేన నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలో ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అసమ్మతి సెగ తగులుతోంది. తెలుగు తమ్ముళ్లు సహాయ నిరాకరణ చేస్తున్నారు. పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించే అంశంలో చాలా మంది ఆలపాటి రాజాకు సహకరించడం లేదు. మరికొందరు మొక్కుబడిగా కానిచ్చేస్తున్నారు. ఆయన తన సొంత మనుషులు, తన ఎస్ఆర్ఐ విద్యాసంస్థల ఉద్యోగులు, విద్యార్థులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్లు కూడా ఆలపాటిని వ్యతిరేకిస్తున్నారు.

**మరో అధికార కేంద్రం అవుతారని...**

ఆలపాటి రాజా గుంటూరు నగరంలోని లక్ష్మీపురంలో కార్యాలయం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు, తన సామాజికవర్గానికి చెందిన నేతలతో రోజూ సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వారికి ఏ పనులు కావాలన్నా తానే చేయిస్తానని చెబుతున్నారు. పెదబాబు, చినబాబులలో ఎవరి వద్దనైనా పనులు చేయిస్తానని పేర్కొంటున్నారు. దీంతో నగరంలో మరో అధికార కేంద్రంగా తన కార్యాలయాన్ని మారుస్తుండటంతో గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు.



**చాలామంది అదే దారిలో...**

ప్రత్తిపాడులో ఒక మీటింగ్ పెట్టి సరిపెట్టారు. పొన్నూరులో అయితే రాజాకు అసలు సహకారం అందలేదని సమాచారం. గతంలో సంగం డైరీ డైరెక్టర్ల విషయంలో ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజా మధ్య విభేదాలు ఉన్నాయి. సొంత నియోజకవర్గమైన తెనాలిలో కూడా సొంతంగా ఓటర్లను చేర్పించే ప్రక్రియను తమ సిబ్బందితో చేయిస్తున్నారు. ఫ్లెక్సీలలో నాదెండ్ల మనోహర్ ఫొటో పెట్టినా ఆయన నుంచి సహకారం శూన్యమని చెబుతున్నారు. గత సాధారణ ఎన్నికల సమయంలో మనోహర్‌కు ఆలపాటి రాజా సహకరించలేదన్న భావన బలంగా ఉండటంతో మంత్రి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పల్నాడులో కూడా యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు తదితరులు కూడా మొక్కుబడిగా కార్యక్రమాలు చేస్తున్నారు.

### గట్టి పోటీదారుతో టెన్షన్ మొదలు

మరోవైపు పోటీలోకి దిగుతున్నట్లు ప్రస్తుత ఎమ్మెల్సీ, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ప్రకటించారు. దీంతో తమ సామాజిక ఓట్లు చీలిపోతాయనే భయం తెలుగుదేశం పార్టీలో వ్యక్తం అవుతోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ అందరికీ అందుబాటులో ఉండే లక్ష్మణరావు మరోసారి బరిలోకి దిగడం వల్ల తమకు ఇబ్బంది అవుతుందన్న భావన ఆ పార్టీలో ఉంది. పార్టీ అధినేత జోక్యం చేసుకుని అందరితో మాట్లాడితే కొద్దో గొప్పో పరువు నిలుస్తుందని, గెలుపు మాత్రం అంత ఈజీ కాదన్న భావన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలలో ఉంది.

## క్లుప్తంగా

### వ్యవసాయ కూలీల ఆటో బోల్తా

నలుగురికి తీవ్రగాయాలు

**చీరాల:** వ్యవసాయ కూలి పనుల నిమిత్తం వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదం మంగళవారం చీరాల – కారంచేడు రోడ్డులో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. స్థానిక విజయనగర్ కాలనీ నుంచి కారంచేడు సమీపంలోని చిట్టివాద పొలం పనులకు వ్యవసాయ కూలీలతో ఆటో బయలుదేరింది. ఆటో కారంచేడు సమీపంలోకి వచ్చేసరికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో పది మంది కూలీలుండగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

### ఆది ఆంధ్రా సొసైటీ పాలకవర్గం రద్దు

ప్రత్యేక అధికారిని నియమించిన కో–ఆపరేటివ్ అధికారి

**బాపట్ల:** దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్రా సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సీహెచ్ శాంసన్ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఆదిఆంధ్రా సొసైటీ భూములకు నష్టపరిహారం చెల్లించగా వాటిని పాలకవర్గంతోపాటు సభ్యులు వ్యక్తిగతంగా వాడుకోవటంపై విచారణ చేపట్టారు. సొసైటీకి సంబంధించిన నిధులను వ్యక్తిగతంగా వాడుకోవటం నిబంధనలకు విరుద్ధం కావటంతో సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సొసైటీకి ప్రత్యేక అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.చంద్రకుమార్ నియమించినట్లు తెలిపారు. పాలకవర్గానికి సంబంధించిన బాధ్యతలు పూర్తిస్థాయిలతో పరిశీలిస్తారని చెప్పారు.

### ఏఎం రెడ్డి కళాశాలలో వాలీబాల్ పోటీలు

**నరసరావుపేటరూరల్:** పెట్లూరివారిపాలెం లోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి ఏడు కళాశాలల జట్లు పోటీలో పాల్గొన్నాయి. పోటీలను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన పోటీలలో ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాల (జొన్నలగడ్డ) విన్నర్‌గా, విక్టోరియా కళాశాల (పేరేచర్ల) జట్టు రన్నర్‌గా నిలిచాయి.

# పవన్ వ్యాఖ్యలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

- మాదకద్రవ్యాలు నిజమే అంటున్న హోం మినిస్టర్ అనిత
- సూపర్ సిక్స్ హామీలన్నీ ఇసుకపై రాతలే
- కులాలను చూసి నిందితులను వదిలేయటం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న అధికార ప్రతినిధి

**మార్టూరు:** రాష్ట్రంలోని మూడు పార్టీల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన మూడెడ్ల బండి సవారీలా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. ఒంగోలు నుంచి తాడేపల్లి వెళుతూ మంగళవారం మధ్యాహ్నం ఆయన మార్టూరులో మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యం జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురంలో చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తాను హోం మినిస్టర్ పదవి తీసుకుంటే మరోలా ఉంటుందని హోం మినిస్టర్ అనిత, ఐజీ, డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు అలసత్వంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తమ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రత్యక్షంగా ఒప్పుకోవటం కాదా? అని ఆయన ప్రశ్నించారు. మహిళలను అత్యాచారం చేసి అంతమొందిస్తున్న నిందితులను కులం చూసి వదిలేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శమని ఆయన ఎద్దేవా చేశారు. తాను హోం మినిస్టర్ పదవి తీసుకొని గబ్బర్ సింగ్ సినిమాలోని హీరోలా తుపాకీతో వ్యవస్థను గాడిలో పెట్టాలని పవన్ కళ్యాణ్ కలలు కంటున్నారన్నారు. ప్రజారక్షణకు అవసరమైన యంత్రాంగాన్ని, సిబ్బందిని నియమించకుండా పోలీసులను, అధికారులను పవన్ కళ్యాణ్ విమర్శించడం వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటమేనని అన్నారు.

**రబీ సీజన్ దాటుతున్నా సాయమేది?**

రబీ సీజన్ దాటుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ ఏమైందని, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పొరుగు రాష్ట్రాల పరిశీలనకే పరిమితమైందని బత్తుల విమర్శించారు. ఇసుక, లిక్కర్ పాలసీలు లోపభూయిష్టంగా ఉన్నాయని అన్నారు. కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ పథకం ప్రకారం ముస్లిం సమాజాన్ని వివక్షకు గురిచేస్తూ వక్ఫ్ ఆస్తుల సవరణ చట్టం 2024 ప్రవేశపెట్టారని, దానిపై టీడీపీ, జనసేన నేతలు తమ వైఖరి ఏమిటో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయిలో ఉన్న నాయకులు తాము మాట్లాడే మాటలు ప్రజలకు భరోసా ఇవ్వాలే కానీ ఆత్మ రక్షణలో పడేలా ఉండకూడదని బత్తుల హితవు పలికారు.

**డైవర్షన్ పాలిటిక్స్ బాబుకు అలవాటే..**

రాష్ట్రంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, అత్యాచారాలు నిజమేనని సాక్షాత్తు హోం మినిస్టర్ ఒప్పుకోవడం చూస్తుంటే ఆమె నిస్సహాయ స్థితికి అద్దం పడుతుందని అన్నారు. బయటకు వస్తే ప్రజలు తమను తిడుతున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్న మాటలు ప్రభుత్వ పాలనా దక్షతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఒకపక్క డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ పాలనా వైఫల్యాలను ఒప్పుకుంటుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం తమ వైఫల్యాలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన పార్టీ కారణమంటూ విమర్శించటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇసుకపై రాతలనే విషయం చంద్రబాబుకు తెలుసని, అందుకే ఆయన డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని బత్తుల విమర్శించారు.

## పోలీసులతో కలిసి టీడీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు

రక్షణ కల్పించాలని డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

**భట్టిప్రోలు:** టీడీపీ నాయకులు పోలీసులతో కలసి తమను హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావులు మంగళవారం తాడేపల్లిలోని డీజీపీ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, ఎస్ఐ శివయ్యతో సోమవారం రాత్రి సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు బాధితులు ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పోలీస్ అధికారులు, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా నుంచి తమకు తగు రక్షణ కల్పించాలని బాధితులు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

# బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

**కర్లపాలెం:** బాపట్ల జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. కర్లపాలెం మండలం యాజలి సెంటర్‌లోని 216 జాతీయ రహదారి వద్ద నుంచి పిట్టలవానిపాలెం మండలంలోని పుచ్చకుర్తివారిపాలెంలో నుంచి ఖాజీపాలెం వరకు గల 6కిలో మీటర్ల పొడవు ఉన్న రహదారికి రూ.39లక్షలతో మరమ్మతు పనులను ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారధి, జిల్లా మంత్రి రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకట మురళీతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారధి మాట్లాడుతూ సముద్రతీర ప్రాంతాన ఉన్న బాపట్ల జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గుంతలు లేని రహదారులే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు సుమారు 826 వేల కోట్లు రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. బాపట్ల జిల్లాలో పనిచేస్తున్న 2,200 మందికి పనిముట్లు, ప్రాథమిక వైద్య కిట్లు అందజేయటానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ గీతారాణి, డీపీఓ ప్రభాకర్, ఆర్డీఓ పి.గ్లోరియా, వేగేశన రాకేష్‌వర్మ, అధికారులు పాల్గొన్నారు.

**తలసరి ఆదాయం పెంపునకు కృషి..**

**బాపట్ల:** ప్రజల తలసరి ఆదాయం రూ.4 లక్షలకు పెంచడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బాపట్లకు తొలిసారిగా వచ్చిన ఆయన మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని తెలిపారు.

**జనవరికి కొత్త అక్రిడిటేషన్లు ఇస్తాం**

**బాపట్ల:** రాష్ట్రంలోని జర్నలిస్టులకు జనవరిలో కొత్త అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చి తీరుతామని రాష్ట్ర పౌర సమాచార శాఖ మంత్రి పార్థసారధి వెల్లడించారు. మంగళవారం బాపట్లకు వచ్చిన ఆయనను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసింది. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు.

## జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



**ఐలవరం(భట్టిప్రోలు):** ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నెల్లూరు జిల్లా దర్గామిట్టా బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఏ యోగా పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుచున్న కె.సంపత్ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. డిసెంబర్ 8 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన సంపత్‌ను, శిక్షణ ఇచ్చిన శ్రీనివాసరెడ్డిని హెచ్ఎం ఎం.మోహన్ రావు, ఉపాధ్యాయులు బదరీనాథ్‌లు అభినందించారు.

# భద్రత చర్యలతో క్వారీల్లో ప్రమాదాలకు చెక్

క్వారీలను తనిఖీ చేసిన ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా బృంద సభ్యులు

**బల్లికురవ:** గ్రానైట్ క్వారీలో భద్రత చర్యలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా బృంద సభ్యులు లీలారామ్, రామకృష్ణ తెలిపారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ ఇంపీరియల్, ఎస్ఆర్, సాయి స్టోన్స్, కె.శ్రీనివాసరావు క్వారీలను టీమ్ పరిశీలించారు. ఆయా క్వారీల్లో రికార్డులు, ఎంతమంది పనిచేస్తున్నారు. భద్రతా చర్యలు, కార్మికులు పనిచేసే ప్రదేశాలు, పొందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయా క్వారీల్లో జెండా ఆవిష్కరణతో కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించి భద్రతా చర్యలను వివరించారు.


ఎస్ఆర్ క్వారీలో జెండా ఆవిష్కరించి, భద్రత చర్యలు వివరిస్తున్న బృంద సభ్యులు

క్వారీలో నూరుశాతం భద్రత చర్యలు పాటించిన క్వారీలకు వారోత్సవాల ముగింపులో బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో మేనేజర్లు పాల్గొన్నారు.

# ట్రూ అప్ చార్జీలు వెంటనే రద్దుచేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

**జే.పంగులూరు:** రాష్ట్ర ప్రజానీకంపై అధిక విద్యుత్ భారాలు మోపేందుకు అమలు చేస్తున్న విద్యుత్ ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. పంగులూరు మండల సీపీఎం మూడో మహాసభలు మంగళవారం పంగులూరులోని సరికొండ అంజమ్ రాజు, సారి కుక్క ఏసోబు నగర్ (రోటరీ భవనం)లో జరిగింది. కార్యక్రమానికి సీనియర్ నాయకుడు మానం హరిబాబు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా గంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, 70 శాతంగా ఉన్న కౌలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తున్న మద్యం బెల్ట్ షాపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రజలు మద్యం బారిన పడకుండా చూడాలని సీపీఎం మండల మహాసభ తీర్మానించింది.

**బీజేపీకి సాగిలపడిన చంద్రబాబు..**

సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాజధానికి రావాల్సిన హక్కులు సాధించాల్సింది పోయి బీజేపీకి సాగిలపడ్డాడన్నారు. ఫలితంగా పోలవరం, రైల్వేజోన్, రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, రాజధాని నిధులు, ప్రత్యేక హోదా తీసుకురావటంలో చంద్రబాబు పూర్తిగా విఫలం అయ్యాడన్నారు. అనంతరం సీపీఎం పంగులూరు మండల కన్వీనర్‌గా తలపనేని రామారావును ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా రాయిని కృష్ణకుమారి, పాలపర్తి ఏలియా, మానం హరిబాబు, పూసపాటి సుబ్బరాజు, నాయపాము ప్రభాకర్‌లను ఎంపిక చేశారు.


మహాసభలో మాట్లాడుతున్న గంగయ్య

## హైకోర్టు ఏజీపీగా ఆనందరావు



**పొన్నూరు:** మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది తాడిశెట్టి వెంకట ఆనందరావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టు సెక్షన్ అధికారి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గుంటూరులో ఆయన న్యాయవిద్య అభ్యసించి, ప్రాక్టీస్ నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పొన్నూరు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు

**నరసరావుపేట ఈస్ట్:** పల్నాడు జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఆధ్వర్యంలో డీఎస్సీ–2024 ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 11వ తేదీలోగా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 మంది అభ్యర్థులకు 2నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తామని వివరించారు. ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను టీటీసీ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ (రూ.ఒక లక్ష లోపు), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫొటోలు జత పరచాలన్నారు. వివరాలకు 9010497267 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

## జీబీసీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ముప్పాళ్ల:** మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువలోని లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం మంగళవారం గుర్తించారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు పైబడి ఉంటాయని, కాల్వలో పడి సుమారు నాలుగు రోజుల పైబడి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా ఉబ్బి కుళ్లిపోయి ఉంది. బోర్లా ఉండటంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి జేసీబీతో మృతదేహాన్ని బయటకు తీశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల నుంచి వైద్యుడిని పిలిపించి అక్కడే శవపంచనామా నిర్వహించి, సమీపంలోనే పూడ్చి వేశారు. నాలుగు రోజుల కిందట వృద్ధులు ఎవరైనా కనిపించకుండా పోయిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, మృతదేహం పై ఎలాంటి దుస్తులు లేవని, కుడి చేతికి మాత్రం రాగి కడియం ఉందని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు.

## ఏఎన్‌యూ అధ్యాపకుడి పరిశోధనకు పేటెంట్



**ఏఎన్‌యూ:** గోదావరిలో లభించే పొలస చేపలలో ఉండే పోషక పదార్థాలపై చేసిన పరిశోధనకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ అధ్యాపకుడు ఆచార్య పీవీ కృష్ణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాలయం నుంచి పత్రం ఆయనకు అందింది. వర్సిటీలో మంగళవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు నుంచి ఆ పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పేటెంట్ రావడం గర్వకారణమన్నారు. ఆచార్య పీవీ కృష్ణ మాట్లాడుతూ.. పులస చేపలలో ప్రోటీన్లు, సాచ్యూరేటెడ్, అన్‌సాచ్యూరేటెడ్ ఆమ్లాలలో అతి ముఖ్యమైన డోకోస హెక్సయినోయిక్ (డీహెచ్ఏ), ఐకోసపెంటయినోయిక్ (ఈపీఏ) ఆమ్లాల మీద పరిశోధన చేశానన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జియాలజీ విభాగాధిపతి ఆచార్య పీజే రత్నాకర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు ఆయన్ను అభినందించారు.

## నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

**మంగళగిరి:** నవులూరు ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి 9వ తేదీ వరకు కుచ్ బెహార్ అండర్ –14 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌లను ఉదయం 8.30 గంటలకు ఏసీఏ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు..

## కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



**కొల్లూరు(వేమూరు):** కొబ్బరి చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి మృత్యువాత పడి ఘటన కొల్లూరు మండలం తిప్పలకట్ట గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన పైసం రాంబాబు (49) కొల్లూరు మండలంలోని తిప్పలకట్ట గ్రామంలో కొబ్బరి తోటలోని కొబ్బరి చెట్టు ఎక్కి బొండాలు కోస్తుండగా మోకు జారటంతో చెట్టుపై నుంచి కిందపడి చనిపోయాడని కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పంపించామని ఆయన తెలిపారు.

## అపార్ నమోదులో సమస్యలను పరిష్కరించాలి



**గుంటూరు ఎడ్యుకేషన్:** అపార్ నమోదులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (అప్సా) రాష్ట్ర కో–కన్వీనర్ మేకల రవీంద్రబాబు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకను అప్సా ప్రతినిధులు కలిశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అప్సా ప్రతినిధులు మాట్లాడుతూ.. అపార్ కోసం విద్యార్థుల వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూడైజ్ ప్లస్, ఆధార్‌లోని వివరాలు సరిపోలకపోవడంతో నమోదు కావడం లేదని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పుల సవరణకు విద్యార్థులు ఆయా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని డీఈవోకు వివరించారు. అపార్ అప్‌లోడింగ్‌కు గడువు పెంచాలని కోరారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఆదివారాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఈవో రేణుక స్పందిస్తూ.. ఆధార్ సవరణల కోసం గుంటూరు నగరంలో అదనపు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాసరావు, ఏవీ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహనరావు, డివిజన్ అధ్యక్షులు నర్రా రాజేష్, భాను ప్రసాద్, నాయకులు మాదా శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, పాశం శ్రీనివాసరావు ఉన్నారు.

# దోపిడీ కేసులో నిందితుడు అరెస్ట్

**అమర్తలూరు:** బెదిరించి నగదు, ఫోన్ లాక్కున్న ఘటనలో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని చుండూరు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అమర్తలూరు పోలీసు స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు.. బాపట్ల పట్టణంలోని బేతనీ కాలనీకి చెందిన జానా సంసోన్ గతనెల 14వ తేదీన తన అత్తగారి ఊరైన ప్రకాశం జిల్లా రాచర్ల మండలం, ఆకువీడు గ్రామానికి వెళ్లేందుకు తెల్లవారుజామున 4 గంటలకు బస్టాండ్ వద్ద నిలిచి ఉన్నాడు. ఈక్రమంలో కారులో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు బస్టాండ్ దగ్గరకు వచ్చి గుంటూరు వరకు వెళుతున్నామని చెప్పి కారు ఎక్కించుకున్నారు. పోన్నూరు నుంచి దారి మళ్లించి ఇంటూరు వైపునకు తీసుకెళ్లి, సంసోను కొట్టి, బెదిరించి అతని వద్ద ఉన్న రూ.10 వేలు నగదు, ఫోన్ తీసుకొని చందోలు బైపాస్ వద్ద వదిలి వెళ్లి పోయారు. ఈమేరకు బాధితుడు అమర్తలూరు పోలీసు స్టేషనుల్లో ఫిర్యాదు చేశాడు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, వెనుక నిందితుడు

పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, దర్యాప్తు చేసి నలుగురు నిందితుల్లో ఒకడైన తురిమెళ్ల శ్యాలరను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. మిగిలిన ముగ్గురిని సైతం త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు


బాస్కెట్‌బాల్ అండర్–14 బాలుర రాష్ట్ర జట్టు క్రీడాకారులు

- అండర్–14 విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం
- అండర్–14 బాల బాలికల రాష్ట్ర జట్లు ఎంపిక

**నరసరావుపేట ఈస్ట్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్–14 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం సాధించగా, కృష్ణా, విశాఖ జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ, అనంతపురం ద్వితీయ, కృష్ణా జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనే అండర్–14 బాల బాలికల రాష్ట్ర జట్టును సోమవారం రాత్రి స్కూల్ గేమ్స్ పల్నాడుజిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మూడురోజులుగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్ జిల్లాల అండర్–14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలలో భాగంగా రాష్ట్ర జట్లు ఎంపిక నిర్వహించారు.

**అండర్–14 బాలుర విభాగంలో** వి.శుశ్రిత్, ఎస్.శ్రీచరణ్, కె.త్రిశాల్ (తూర్పుగోదావరి), ఈ.కౌశిక్, ఎం.సంతోష్ (అనంతపురం), ఈ.చార్లెస్‌వెస్లీ (పశ్చిమ గోదావరి), జి.జగదీష్, వి.కేతన్‌సాయి (కృష్ణా), కె.జైరామ్ (విశాఖ), పి.జీవన్ (కర్నూల్), కె.సాయిసంతోష్ (చిత్తూరు), కె.కార్తికేయ (నెల్లూరు).

**అండర్–14 బాలికల విభాగంలో** సిహెచ్.ఐశ్వర్యాంబిక, బిఎస్ఆర్ మాధురి, సిహెచ్.భువనేశ్వరీ (తూర్పుగోదావరి), బి.కుసుమ, ఆర్.వాహిని (కృష్ణా), జి.శాస్య, కె.అమూక్త (విశాఖ), యోగశ్రీ (పశ్చిమగోదావరి), ఎస్.సాయిశ్రీ (గుంటూరు), రిషిత (చిత్తూరు), శ్రీజా (అనంతపురం), ఎస్.ముస్కాన్ (కర్నూలు).

## క్లుప్తంగా

### ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు



**రేపల్లె రూరల్:** ఆధార్ కార్డు లేని ఎస్టీలు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని రాజుకాల్వ, చోడాయపాలెంలోని పంచాయతీ కార్యాలయాల్లో ఎస్టీలకు నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. కాల్వ గట్లపై, పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న పలువురు ఎస్టీలు నేటి వరకు ఆధార్ కార్డులు పొందక పోవడాన్ని గుర్తించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

### సీనియర్ అసిస్టెంట్ మృతి



**వేమూరు:** తహసీల్దారు కార్యాలయంలోని నియోజకవర్గ ఎన్నికల విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ మస్తాన్(53) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. దుగ్గిరాల, తెనాలి మండలాల్లో వీఆర్వోగా పని చేశారు. వేమూరు, తెనాలి తహసీల్దార్లు బి.సుశీల, గోపాల కృష్ణ, వీఆర్వోలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయం సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

### విప్లవ కవి దాశరథి



**బాపట్ల:** నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన విప్లవ కవి దాశరథి అని రావూరి నరసింహవర్మ ప్రశంసించారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి ఆధ్వర్యంలో దాశరథి 37వ వర్ధంతి సభ మంగళవారం జరిగింది. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ ఆధ్యక్షత వహించారు. దాశరథి 600 సినిమాలకు దాదాపు రెండు వేలకు పైగా పాటలు రచించి, తెలుగు సంగీత సాహిత్య ప్రియులను అలరించారన్నారు. ప్రజాకవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ దాశరథి ఒకవైపు అంగారాన్ని మరోవైపు శృంగారాన్ని వ్యక్తపరచిన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.' ఆ చల్లని సముద్ర గర్భం 'అనే పాటలో ప్రపంచ పరిణామాన్ని, ప్రజల జీవన పోరాటాన్ని చాలా గొప్పగా అభివ్యక్తీకరించారన్నారు. సభలో ఎం. మల్యాద్రిరావు ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి. కె.కాళిదాసు, పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు దాశరథి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

### 12న మండల సర్వసభ్య సమావేశం

**భట్టిప్రోలు:** మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 12న మధ్యాహ్నం 2:30 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

# సూర్య ఘర్‌కు జనాదరణ

- సోలార్ విద్యుత్ పై ఆసక్తి చూపుతున్న ప్రజలు
- పీఎం సూర్య ఘర్ పథకంపై ఆసక్తి
- విద్యుత్ ఆదాతో పాటు పెట్టుబడి రిటర్న్స్
- విద్యుత్ రీడింగ్ తెలుసుకునే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతం
- కేంద్ర పథకంతో గృహ వినియోగదారులకు ఉపశమనం



సోలార్ ప్యానల్ సిస్టమ్

**భట్టిప్రోలు:** జనం సోలార్ పవర్‌కు జైకొడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలతో..ప్రజలు అటు వైపు మొగ్గు చూపుతున్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు నాలుగేళ్లు.. 2027 వరకు కొనసాగే విధంగా తీసుకువచ్చిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనకు మంచి ఆదరణ లభిస్తోంది. కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌తో నెలకు 120, 2 కిలో వాట్స్‌కు 240, 3 కిలో వాట్స్‌కు 360 యూనిట్ల పైబడి విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. తద్వారా గణనీయంగా విద్యుత్ బిల్లు ఆదా కానుంది. తెనాలి డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ల కింద ఇప్పటి వరకు ఈ పథకం కింద 500 మందికి పైగా గృహ యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. 30 సర్వీసులు విడుదల చేయగా మరో 50 సర్వీసులకు సంబంధించి సోలార్ రూఫ్ టాప్ పనులు జరుగుతున్నాయని తెనాలి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ చిరంజీవి తెలిపారు.

### ఈ పథకంలో చేరాలంటే..

సూర్య ఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో 6 నెలల కరెంటు బిల్లు కాపీలను జతచేయాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కిలో వాట్‌ను బట్టి సబ్సిడీ అందనుంది. మిగిలిన మొత్తానికి బ్యాంక్ రుణ సదుపాయం అవకాశం ఉంది. అలాగే పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ అమరుస్తారు. ఒక కిలో వాట్‌కు సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ నెలకు సుమారు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి 6 నుంచి 7 ఏళ్లల్లో తిరిగి పొందే అవకాశం ఉందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

### విద్యుత్ బిల్లు ఆదా...

ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇంటి పైకప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు, 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ పవర్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు.

### రాయితీ ఇలా

ఈ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి ఒక కిలో వాట్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్ ప్లాంట్‌కు రూ.60 వేలు, మూడు కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారికి రూ.78 వేలు గరిష్ట రాయితీ అందుతుంది.



సోలార్ ప్యానల్ బోర్డు

### దరఖాస్తు చేసుకోండి ఇలా..

ముందుగా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో యజమాని పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందు కోసం రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. విద్యుత్ కనెక్షన్ వినియోగదారుల మొబైల్ నంబరుతో లాగిన్ అవ్వాలి. అక్కడ రూఫ్‌టాప్ సోలార్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. www.pmsuryaghar.gov.in/APCPDCL వెబ్ సైట్ ద్వారా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు–1912కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

### ఎంత కెపాసిటీ కావాలంటే

- నెలకు 0 నుంచి 150 యూనిట్లు విద్యుత్ వినియోగించే వారికి 1–2 కిలో వాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.
- 150–300ల యూనిట్ల చొప్పున వినియోగించే వారు 2–3 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.

### అనుమతులు వచ్చే వరకు

అనుమతి వచ్చిన తరువాత డిస్కంలోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టలేషన్ పూర్తైన తర్వాత ఆ ప్లాంట్ వివరాలు పోర్టల్‌లో సమర్పించి, నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ మీటర్ ఇన్‌స్టాల్ చేశాక విద్యుత్ శాఖాధికారులు తనిఖీ చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమీషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ రిపోర్టు పొందిన తరువాత బ్యాంక్ ఖాతా వివరాలతో పాటు క్రాస్డ్ చెక్కును పోర్టల్‌లో సబ్‌మిట్ చేయాలి. 30 రోజులలోగా ఖాతాల్లో సబ్సిడీ జమ అవుతుంది.

### సద్వినియోగం చేసుకోవాలి



గృహ యజమానులకు అద్భుతమైన పథకం పీఎం సూర్యఘర్. సోలార్ విద్యుత్ ప్యానల్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం అందిస్తుంది. పెట్టిన పెట్టుబడి ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే ట్రాన్స్‌కో అధికారులు నివృతి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

–చిరంజీవి, ఈఈ, విద్యుత్ శాఖ, తెనాలి

### పోలేరమ్మకు కోన పూజలు



**నక్కలవానిపాలెం(కర్లపాలెం):** గ్రామ దేవత తాడిచెట్టు పోలేరమ్మకు వైఎస్సార్ సీపీ బాపట్ల ఇన్‌చార్జ్, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మంగళవారం పూజలు నిర్వహించారు. పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవానిపాలెంలో గ్రామ పెద్దల సహకారంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఇటీవల నూతన ఆలయం నిర్మించి, పోలేరమ్మ, పోతురాజు స్వాముల విగ్రహాలను ప్రతిష్టించారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆలయంలో ప్రదక్షిణలు చేసి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, సర్పంచ్‌లు యల్లావుల సురేష్‌రాదవ్, దబ్బకూటి ఏడుకొండలు, దేవరకొండ రమేష్, పార్టీ నాయకులు పందరబోయిన శ్రీనివాసరావు, అంగలకుదురు ప్రకాష్, కేసాని వరప్రసాద్, తాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

### మద్యం విక్రేతల అరెస్ట్

**రేపల్లె రూరల్:** వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, కోర్టుకు హాజరుపరిచినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన గోలి రామస్వామి అదే గ్రామంలో మద్యం విక్రయిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రేపల్లె మండలం లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి రాముడు గ్రామంలోని బస్‌షెల్టర్ వద్ద మద్యం విక్రయస్తూ..పట్టుబడ్డాడని, అతని నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# మందుబాబులకు ఆతిథ్యం



అధ్వాన స్థితిలో తహసీల్దార్ కార్యాలయంలోని గెస్ట్‌హౌస్



గెస్ట్ హౌస్ ఆవరణలో పడవేసిన మద్యం సీసాలు

- బూత్ బంగ్లాను తలపిస్తున్న రెవెన్యూ గెస్ట్‌హౌస్
- భవన ఆవరణలో విష పురుగుల సంచారం

**రేపల్లె రూరల్:** రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రేపల్లె పట్టణంలోని తాలూకా ప్రాంగణంలో 21 ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కచోటే ఉండటం విశేషం. వివిధ పనులపై రేపల్లెకు వచ్చే ప్రజలకు కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో వారు తమ పనులను పూర్తి చేసుకునేందుకు సులువుగా ఉంది. ఈ కార్యాలయాలకు కూతవేటు దూరంలో తాలూకా కార్యాలయ ఆవరణంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ బూత్ బంగ్లాను తలపిస్తోంది. అధికారుల వసతి గృహం అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి.. చిట్టడవిని తలపిస్తూ విష పురుగుల సంచారానికి అనువుగా మారింది. రాత్రిళ్లు తాలూకా ప్రాంగణంలో నిఘా కొరవడటంతో మందు బాబులకు అతిథిగా గృహంగా మారింది. గెస్ట్ హౌస్ సమీపంలోనే పోలీసు సర్కిల్ కార్యాలయం, సబ్ కోర్టు, సీడీపీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయాలకు వచ్చే ప్రజలు కాసేపు సేద తీరేందుకు ఇక్కడ బల్లలపై కూర్చునేందుకు రాగా.. తాగి పడేసిన మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. విష పురుగులు సంచరిస్తుండటంతో ఆందోళనకు గురవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో ఒక ఆవు ఇటుగా వచ్చి పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన అందరికి తెలిసిందే.

### వినియోగంలోకి తెస్తే వసతికి ఉపయోగం

రేపల్లెను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయడంతో నిత్యం జిల్లా కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించేందుకు విచ్చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు మరమ్మతులు నిర్వహించి, వినియోగంలోకి తీసుకువస్తే అధికారులు కాసేపు సేద తీరేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెస్ట్ హౌస్ ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి, వాడుకలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

### ఓటు నమోదుకు నేడు గడువు ఆఖరు

**వేమూరు:** గుంటూరు, కృష్ణా గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు ఓటు నమోదుకు బుధవారం సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సుశీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా లేదా తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**చందోలు(కర్లపాలెం):** ఎదురుగా వస్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్‌పై నుంచి వ్యక్తి కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చందోలు శివారులో చోటు చేసుకుంది. చందోలు ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ వివరాల మేరకు.. పాత నందాయపాలెం ఎస్టీ కాలనీకి చెందిన అక్కల కృష్ణారెడ్డి చెరుకుపల్లి మండలంలోని అక్కల వెంకటరెడ్డిపాలెం వెళ్లి సోమవారం రాత్రి ద్విచక్ర మోటరు వాహనంపై వస్తుండగా చందోలు శివారులో జాతీయ రహదారిపై రోడ్డుపై వస్తున్న వ్యక్తి తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడని తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించాలి



కారుమూరులో వరిపైరు పరిశీలన

**రేపల్లె రూరల్:** రైతులు సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంభించి, అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమూరు, మోర్లవారిపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన వరి పైరును పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించాలన్నారు. తెగుళ్లు ఆశించకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు, మందుల వినియోగించాలని ఎప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నికేష్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

**అమర్తలూరు(వేమూరు):** వరి పైరులో ఆకు ముడత తెగులు నివారణకు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో పొలం పిలుస్తొంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గత నెలలో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరిపైరు రక్షణకు సూచనలు చేశారు.

**చుండూరు(వేమూరు):** వరి పైరులో దోమ ఉధృతంగా ఉంటే నివారణకు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బండ్లమూడి ఆదాంబాబు తెలియజేశారు. చుండూరు మండలంలోని తొట్టెంపూడి, మోదుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తొంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పైరు బిర్రు పొట్ట, గింజ గట్టి పడే దశలో ఉందన్నారు. రైతులు యూరియా, పొటాష్ ఎరువులు వేయాలని సూచించారు.

# వారంలో రెండు రోజులు వ్యాక్సినేషన్

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

**ప్రత్తిపాడు:** ప్రతి వారం బుధ, శనివారాల్లో తప్పనిసరిగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువుల ఆధారంగా గ్రోత్ చార్ట్ సిద్ధం చేసుకోవాలి, పెరుగుదల పట్టికలో ఏమైనా రెండ్ అలర్ట్ ఉంటే వెంటనే వైద్యాధికారులకు తెలియజేయాలని చెప్పారు. గర్భిణులు పుట్టింటికి వెళ్లినప్పటికీ, ప్రసవించే వరకు ఏఎన్ఎంలు ఫాలోఅప్ చేయాలని కోరారు. అదే విధంగా బిజిటీ టీకాను వేగవంతం చేయాలని కోరారు. సచివాలయ ఏఎన్ఎంలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు సమయాన్ని మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పురుషులు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మేరి యునిస్, హేమంత్, ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల పాల్గొన్నారు.

# కనుల పండువగా నాగులచవితి వేడుకలు

- నాగయ్య నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు
- పాలు పోసేందుకు పుట్టల వద్ద బారులు తీరిన భక్తులు



నాగేంద్రపురంలోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసేందుకు బారులు తీరిన భక్తులు



రేపల్లెలోని రామలింగేశ్వరస్వామికి పాలు సమర్పిస్తున్న భక్తులు

**బాపట్లటౌన్:** నాగులచవతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు మంగళవారం నాగయ్య..నాగప్ప...నాగరాజా...నీకు కమ్మనిపాలు తెచ్చామయ్యా....నాగరాజా అంటూ నాగేంద్రస్వామిని స్మరించుకున్నారు. కార్తీకమాసంలో వచ్చే కార్తీక శుద్ద చవితిను పురస్కరించుకొని పట్టణ, మండలంలోని పలు ఆలయాలతో పాటు నాగేంద్రస్వామి పుట్టలవద్ద నాగేంద్రస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చవతిరోజు స్వామివారికి ప్రీతి అయినటువంటి ఆవుపాలు, గుడ్లను స్వామివారి పుట్టల్లో వేసి మొక్కులు చెల్లించుకోవడం అనవాయితీగా వస్తుందని మహిళలు చెబుతున్నారు. ఆదర్శనగర్ పుట్టవద్ద పూజారి వీర్లంకమ్మ మాట్లాడుతూ స్వామివారిని నిండు మనస్సుతో ప్రార్థిస్తే కొరిన కొర్కెలు తీరుతాయన్నారు. నాగులచవతిరోజున నాగ సర్పజాతుల పడగనీడపడినా, స్పర్శ తగిలినా అదృష్టం కలుగుతుందన్నారు.

**భక్తిశ్రద్ధలతో నాగుల చవితి**

**నగరం:** నాగులచవితి పర్వదినాన్ని మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని నాగేంద్రస్వామి పుట్టలో మహిళలు పాలు పొసేందుకు బారులు తీరారు. వేకువజాము నుంచే పుట్టలో పాలు పొసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆవుపాలు, చలిమిడి, వడ పప్పు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రితో స్వామివారికి విశేష పూజలు చేశారు.

**కర్లపాలెం:** మండలంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కర్లపాలెం పెద్దింటమ్మ ఆలయంలోని జంట నాగుల విగ్రహాలకు, ఇందిరానగర్ ఆదిశేషుని ఆలయం, బుద్దాం గ్రామంలోని ఆదిశేషుని పుట్ట, నల్లమోతువారిపాలెం నాగేంద్రస్వామి పుట్ట, లంక కాలువ నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాలు పోసి పసుపు కుంకుమలు, చలిమిడి, వడపప్పు సమర్పించి టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

**భట్టిప్రోలు:** నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం భట్టిప్రోలు మండలంలో ఘనంగా నిర్వహించారు.

గంగాపార్వతీ సమేత విఠలేశ్వరస్వామి దేవాలయం, కోనేటిపురంలో కొలువైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న పుట్టల్లో భక్తులు నాగులచవితి పూజలు నిర్వహించారు. కోనేటిపురం ఆలయంలో బాలస్వామి, యునెస్కో వాస్తు పండిట్ అవార్డు గ్రహీత వంమయ్య సిద్దాంతిల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



కోనేటిపురంలో నాగేంద్ర స్వామికి పూజలు

**చుండూరు(వేమూరు):** చినపరిమి గ్రామంలోని పోతురాజు స్వామి దేవస్థానంలో ఉన్న పుట్టలో మహిళలు పాలు పొసి పూజలు నిర్వహించారు.



ఆదర్శ నగర్‌లో బారులు తీరిన భక్తులు

మంగళవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**రేపల్లె రూరల్:** పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, పేటేరులోని ఆంజనేయస్వామి, ఉప్పూడి గ్రామం, మోర్తోట గ్రామంలోని ముక్తేశ్వర స్వామి, బేతపూడి గ్రామంలోని బేతపూడమ్మ అమ్మవారి ఆలయాల్లో ఉన్న నాగేంద్రస్వామి పుట్టలకు నాగుల చవితి సందర్భంగా భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విద్యార్థులకు అర్ధాకలేనంట..!

చాలీచాలని మధ్యాహ్నం వంట..



ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని పాఠశాలలో తింటున్న కొందరు విద్యార్థినులు

**ప్రత్తిపాడు:** పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చాలీచాలని వంటతో విద్యార్థులను అర్ధాకలికి పరిమితం చేస్తున్నారు. అందుకు సాక్ష్యమే ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనిపించిన ఈ చిత్రాలు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులకు మెనూ ప్రకారం పులిహోర, దొండకాయ చట్నీతో పాటు కోడి గుడ్డును అందించాల్సి ఉంది. అయితే పులిహోర కాస్త అటుఇటుగా ఉన్నప్పటికీ చట్నీ సరిపడినంత లేకపోవడంతో విద్యార్థులు ఉన్నదాంతోనే సర్దుకోవాల్సి వచ్చింది. గిన్నె పూర్తిగా అడుగంటడంతో లోపల గదిలో నుండి చిన్న గ్లాసులో చట్నీ తెచ్చి నిర్వాహకులు సర్దుబాటు చేశారు. మధ్యాహ్న భోజనం అమలును పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షణను గాలికొదిలేయడంతో చాలీచాలని భోజనమే విద్యార్థులకు దిక్కయ్యింది. పాఠశాలలో సగం మందికి పైగా విద్యార్థులు బడిలో మధ్యాహ్న భోజనం చెయ్యకుండా ఇంటి నుండి బాక్సులు తెచ్చుకుని తింటున్నారు.